కార్మికుల వేతనాల పెంపునకు ఆమోదం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం

కడప కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంపుదల చేసేందుకు కడప నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం అధ్యక్షతన ఆమె ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటగిరి–1 కార్మికులకు రూ.24,500, కేటగిరి–2 వారికి రూ.21,500, కేటగిరి–3 వారికి రూ.18,500 ఇవ్వాలని, ఇందుకయ్యే ఖర్చును నగరపాలక సాధారణ నిధులను వెచ్చించాలని నిర్ణయించారు. ఇటీవల సహజ మరణం పొందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి శీలం యోసెఫ్‌కు రూ.2 లక్షలు, విధి నిర్వహణలో అనారోగ్యంతో మరణించినవారికి రూ.6లక్షలు పరిహారం ఇవ్వాలని తీర్మాణించారు. కడప కార్పొరేషన్ పరిధిలో 100 స్మార్టు స్ట్రీట్‌లు ఏర్పాటు చేయుటకు రూ.2.90 కోట్లు వినియోగించాలని నిర్ణయించారు. మొదటగా కలెక్టరేట్ దగ్గర 30 షాపులతో స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. రాజీవ్ పార్కు వద్ద ముందు భాగంలో తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్లు, పానీ పూరీ బండ్లు పెట్టుకొని వ్యాపారం చేసుకోవడానికి మార్కింగ్‌లు వేసి బహిరంగ వేలం ద్వారా షాపులు కేటాయించి నెలకు రూ.5వేలు, రూ.6వేలు చొప్పున బాడుగ వసూలు చేయాలని నిర్ణయించారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని 33, 10 నంబర్ షాపులను వేలం వేయాలని, 26 నుంచి 32 వరకూ ఉన్న షాపులకు 33.33 శాతం బాడుగల పెంపుతో రెన్యువల్ చేసేందుకు ఆమోదం తెలిపారు. నగరంలో బీఓటీ పద్ధతిలో చెన్నూరు బస్టాండు, పాత బస్టాండు, సెవెన్‌రోడ్స్, కలెక్టరేట్, మాచుపల్లి బస్టాండు, పాతరిమ్స్ ప్రవేశ ద్వారం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, పాత మహిళా పోలీస్‌స్టేషన్‌ల వద్ద మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టేందుకు అంగీకారం తెలిపారు. మాచుపల్లి రోడ్డులో మాసాపేట సర్కిల్ నుంచి రింగు రోడ్డు వరకూ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని 28వ డివిజన్ కార్పొరేటర్ అరీఫుల్లా బాషా చేసిన వినతిని ఆమోదించారు. ఈ సమావేశంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు కె. బాబు, మగ్బూల్‌బాషా, బాలస్వామిరెడ్డి, ఎస్. వాణి, అరీఫుల్లా బాషా, అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, డిప్యూటీ కమిషనర్ రాంబాబు, ఎస్ఈ చెన్నకేశవరెడ్డి, ఈఈలు ధనలక్ష్మి, విజయ్ కుమార్‌రెడ్డి, డీసీపీ శైలజ, మాజీ కార్పొరేటర్ జమాల్‌వలీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

10న కమలాపురంలో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదిన కమలాపురం పట్టణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.00 గటలకు కమలాపురం పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే ఈ జాబ్ మేళాకు 10 కంపెనీల ప్రతినిధులు వస్తారన్నారు. టెన్త్, ఇంటర్మీడియేట్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, డిగ్రీ చదివి 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి హోదా ప్రకారం రూ. 10–25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

ఉత్సాహంగా ఎంపికలు



విద్యార్థులకు సలహాలు, సూచనలను ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా అండర్–14, 17 బాల బాలికల మండల స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ ఎంపికలను మండల కో–ఆర్డినేటర్ మహబూబ్ బాష ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలను ఏపీపీఈటీ, ఎస్ఏపీఈ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాజిత్ అరుణ కుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు చేపట్టారు. ఇక్కడ ఎంపికైన జట్లు తర్వాత డివిజన్ లెవెల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనవలసి ఉంటుందన్నారు. ఈ ఎంపికలకు నగరంలో వివిధ పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు.

గ్రామీణులను చైతన్యం చేయాలి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్ 4,7 ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలంలోని ఇసుక పల్లె ,మిట్టమీద పల్లెలో ప్రత్యేక శిబిరాలను బుధవారం ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కే లలిత, డాక్టర్ సునీతల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరాలను విశ్వవిద్యాలయ జాతీయ సేవ పథకం సమన్వయ కర్త డాక్టర్ ఎస్ వెంకట్రామిరెడ్డి సందర్శించి వారం రోజుల శిబిరం ప్రత్యేకతను వివరించారు. వాలంటీర్లు సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, గ్రామీణులను చైతన్యం చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయ సైకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వై లాజర్ మాట్లాడుతూ విద్యార్థుల మూర్తిమత్వ లక్షణాలను గురించి వివరించారు. వారం రోజుల పాటు గ్రామంలో చైతన్య , సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రోగ్రాం ఆఫీసర్లు తెలిపారు.

విద్యార్థులు దృఢమైన మనస్తత్వాన్ని కలిగి ఉండాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సమగ్రశిక్ష కౌన్సిలర్ పవిత్ర

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు దృఢమైన మనస్తత్వాన్ని కలిగి ఉండాలని సమగ్రశిక్ష కౌన్సిలర్ పవిత్ర పేర్కొన్నారు. అదే విధంగా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం నిర్దేశించుకోవాలని లక్ష్యసాధన కోసం కృషి చేయాలని సూచించారు. బుధవారం కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య వారం కార్యక్రమంలో భాగంగా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 6 వ తేదీ నుంచి 10 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్ పవిత్ర తెలియజేశారు. ప్రధానోపాధ్యాయురాలు మోబీన్ రీహానా పాల్గొన్నారు.

14న వేలం పాట

చాపాడు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర దేవస్థానం సన్నిధిలో ఈనెల 14న తలనీలాల సేకరణ, టెంకాయల అంగడి నిర్వహణకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శంకర్‌బాలాజీ తెలిపారు. 14న ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని, అత్యధిక వేలం పాట దారుడికి ఏడాదిపాటు తలనీలాల సేకరణ, టెంకాయల అంగడి నిర్వహణ అప్పగిస్తామని ఆయన పేర్కొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్టు

కొండాపురం: మండల పరిధిలోని పొట్టిపాడు గ్రామంలో జరుగుతున్న కోడిపందేలపై బుధవారం దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వీరి వద్ద నుంచి పందెం కోళ్లు, రూ. 3,850 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అభినందన



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి సరితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తిలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ విద్యార్థిని సరిత ఎంఏ (తెలుగు) 2022 – 24 బ్యాచ్ రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఇటీవల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ చేతుల మీదగా ఈ రెండు బంగారు పతకాలను అందుకున్నారు . ఈ సందర్భంగా కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ పి. బయపురెడ్డి తదితరులు విద్యార్థిని సరితను అభినందించారు. ఈమె కడప నగరంలోని బాలికల హైస్కూల్‌లో తెలుగు టీచర్ గా పనిచేస్తున్నారు. ఈమె భర్త సునీల్ కడప నగరంలోని సాయిపేట మున్సిపల్ హైస్కూల్లో తెలుగు టీచర్‌గా పని చేస్తున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కమలాపురం: క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఇష్టమైన క్రీడలను ఎంచుకుని వాటిలో రాణించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ అన్నారు. బుధవారం స్థానిక గురుకుల పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ సుబ్బన్న, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సునీల్ పర్యవేక్షణలో జరిగిన మండల స్థాయి అండర్–14, అండర్–17 విభాగాల క్రీడా ఎంపికలను ఆమె ప్రారంభించారు. మొదటి రోజు కబడ్డీ, బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతోనే దేశానికి పేరు ప్రతిష్టలు లభిస్తాయన్నారు. విద్యార్థులు క్రీడలు ఆడినపుడే మెదుడు చురుగ్గా పని చేస్తుందని, తద్వారా చదువులో కూడా రాణించవచ్చన్నారు. అలాగే క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన వారిని డివిజన్ స్థాయి పోటీలకు పంపిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

వల్లూరు: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని గంగాయపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘునాథరెడ్డి అన్నారు. గంగాయపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ జట్ల ఎంపికలో భాగంగా బుదవారం విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా అండర్ -14, అండర్ - 17 కేటగిరీలో బాలుర, బాలికల విభాగాల్లో వేరు వేరుగా నిర్వహించిన ఈ పోటీలకు మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్ఎమ్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని మండల స్థాయి జట్టుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీడీలు అజాస్ అహమ్మద్, సుశీలమ్మ, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పలువురికి లబ్ధి

మైదుకూరు : జీఎస్టీ తగ్గింపుతో దేశంలో పలు వర్గాలకు లబ్ధి చేకూరిందని ప్రొద్దుటూరు జీఎస్టీ విభాగం డిప్యూటీ కమిషనర్ చక్రానాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు వకృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో...

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి మాట్లాడుతూ డిజిటల్ లెర్నింగ్ టూల్స్, క్రీడా పరికరాలు, దుస్తులు, పాద రక్షలు, ఆట బొమ్మలు, స్టేషనరీపై జీఎస్టీ తగ్గింపు వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్బారావు, మున్సిపల్ మేనేజర్ పరమేశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం జీఎస్టీ 2.0 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగమని ప్రిన్సిపాల్ రామిరెడ్డి చెప్పారు.


ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్

కడప అగ్రికల్చర్: జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ సూచించారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయం మీద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అగ్రికల్చర్ డివిజన్ వారీగా ప్రకృతి వ్యవసాయంలో అమలవుతున్న ఏటీఎం , అప్ గ్రేడ్ పంటల నమూనాలు, పీఎండీఎస్, బయో రిసోర్స్ సెంటర్స్‌తోపాటు వరిలో ఆరుతడి పంటలు అమలు విధానంపై సమీక్షించారు. ప్రతి ఒక్క ప్రకృతి వ్యవసాయ రైతును కూడా ఈ పంట లో నమోదయ్యే విధంగా సిబ్బంది అందరూ ఆర్ఎస్‌కే అగ్రికల్చర్ అసిస్టెంట్స్‌తో సమన్వయం చేసుకొని పని చేయాలని తెలియజేశారు. రాబోయే రబీ పంట కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేశారు. అదే విధంగా సిబ్బంది అందరూ రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి పంట చీడపీడల నివారణపై తగు సూచనలు సలహాలు అందజేయాలని తెలియజేశారు. రాబోవు రోజుల్లో ప్రకృతి వ్యవసాయం మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లి ప్రతి ఒక్క రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ సూచించారు. బుధవారం కడప అంగడివీధిలోని అమరావతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో రహదారి భద్రత..ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి నుంచి స్కూళ్లకు వచ్చేటప్పుడు వాహనాలు ఏమీ రావడం లేదని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే రోడ్డు దాటాలన్నారు. అలాగే రోడ్డు పైన ఉండే ట్రాఫిక్ లైట్లను గమనించాలన్నారు. పాదచారుల కోసం ఉన్న గ్రీన్ లైట్ వెలిగినప్పుడు మాత్రమే రోడ్డు దాటాలి. రెడ్ లైట్ వెలిగితే ఆగిపోవాలి. కదులుతున్న వాహనం నుండి బయటికి చేతులు పెట్టడం, కిటికీల నుండి బయటికి చూడటం వంటివి చేయకూడదు. అలాగే రోడ్ల మీద లేదా వాహనాలు తిరిగే చోట ఆడుకోకూడదన్నారు. పార్కులు, ఆట స్థలాలు వంటివి ఆటలకు సురక్షితమైన ప్రదేశాలు అన్నారు. జీవితం విలువైనది. ఒక్క క్షణం నిర్లక్ష్యం , జీవితాంతం బాధను మిగల్చవచ్చని అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాలు నివారించడంలో భాగస్వాములవ్వాలని సూచించారు.

పుట్లంపల్లి చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివారు ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలకు ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఉల్లాసాన్ని పెంచే విధంగా పుట్లంపల్లి చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి కోరారు. బుధవారం పుట్లంపల్లె చెరువును ఆర్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర నిధులతో ఆజాదిక అమృత్ మహోత్సవ్, మిషన్, అమృత్ సరోవర్ పథకం కింద దేశంలోని కొన్ని చెరువులను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. అందులో భాగంగా కడపలోని 134 ఎకరాల విస్తీర్ణం కలిగిన పుట్లంపల్లి చెరువు కట్టపై 1615 మీటర్ల రహదారి పనులను చేపట్టి మూడేళ్లు గడిచినదని, పనుల వేగవంతంలో నత్తే నయంగా పనులు సాగుతున్నాయని, ఈ పనులు ఎప్పటికి పూర్తవుతాయో అని ప్రశ్నించారు. పాలకొండ నుండి ప్రవహించే నీటిని అంతా పుట్లంపల్లి చెరువులో నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉందని, ఆ రకంగా పుట్లంపల్లి, బుడ్డాయిపల్లి, నడింపల్లి చెరువులన్నింటిని నీటితో నింపి అందులో బోటు షికారు సౌకర్యాన్ని, మధ్యలో ఫ్యామిలీ రెస్టారెంట్, ఫంక్షన్ హాలు, నీటిపై ఆడుకునే వివిధ రకాల ఆటలకు సంబంధించినవి, వాటర్ వండర్ ల తరహాలో వినోదాన్ని అందించడంతో పాటు నగర ఆదాయాన్ని సమకూర్చుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, విజయ్ కుమార్, వినోద్, రమేష్, తులసిరామ్, గంగయ్య, శీను, స్రవంతి, అమత తదితరులు పాల్గొన్నారు.

మినుములో సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు



పంపిణీ చేసిన విత్తనాలతో రైతులు, శాస్త్రవేత్తలు

కడప అగ్రికల్చర్: మినుములో సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులను సాధించవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ సూచించారు. ఊటుకూరు కేవీకే ద్వారా అపరాల ఆదర్శ పథకంలో భాగంగా బుధవారం వల్లూరు మండలంలోని దిగువపల్లె గ్రామానికి చెందిన 50 మంది రైతులకు మినుములో యల్.బి.జి. 884, వి.బి.యన్ – 08 రకాలను దాదాపు 150 ఎకరాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేవీకేలో నిర్వహించిన సమావేశంలో సమన్వయకర్త డా. కె. అంకయ్య కుమార్ మాట్లాడుతూ రైతులకు అపరాల ఆదర్శ గ్రామం పథకంలో భాగంగా రైతులకు పంపిణీ చేసిన మినుము రకాలు పల్లాకు తెగులును తట్టుకొనే రకం అన్నారు. పంట వేసిన 70–75 రోజులలో పంట చేతికి వస్తుందని ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ళ దిగుబడి వస్తుందని తెలిపారు. కె.వి.కె శాస్త్రవేత్త డాక్టర్ టి .మహేష్ బాబు మాట్లాడుతూ మినుములో సమగ్ర యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఎకరానికి ఒక బస్తా డి.ఎ.పి లేదా 20–20–0–13 దుక్కిలో వేసుకోవాలని, రైతులకు మేలి రకం విత్తనం ఇస్తున్నందువలన విత్తనోత్పత్తికి వైపు కూడా మొగ్గు చూపి తద్వారా అధిక ఆదాయాన్ని ఆర్జించాలని తెలిపారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డా. వి. శిల్పకళ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.వి.కె, శాస్త్రవేత్తలు డా. యస్. ప్రశాంతి, డా. యస్. మానస, డా. ఐ. సురేష్ కుమార్ రెడ్డి , దిగువపల్లె గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

జీఎస్టీ పై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు జీఎస్టీపైన అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వరి సూచించారు. బుధవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాలలో జీఎస్టీపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సూపర్ జీఎస్టి, సూపర్ సేవింగ్స్ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జీఎస్టీ ధరల తగ్గింపుపై విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ అధ్యాపకులు హబీబుల్లా జీఎస్టీ తగ్గిన ధరలను వివరాలను ఎంత మేరకు ఆదా ఉంటుందనే విషయాలను ప్రజలకు తెలపాలన్నారు. హిస్టరీ అధ్యాపకులు శ్రీరాములు రెడ్డి మాట్లాడుతూ నిత్యఅవసర వస్తువులు, ఎలక్ట్రానిక్ యంత్రాలు, గృహాలకు అవసరం వచ్చే పరికరాలు, తిను బండార వస్తువుల ధరలను క్షుణ్ణంగా పరిశీలించి మార్కెటింగ్ చేయాలన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో కళాశాల నుండి కొత్త కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చెప్పలి రాజారావు, అధ్యాపకులు చంద్రమౌళి, అమృత రాజు, సుజాత, పద్మావతి, రోజమ్మ, సుధాకర్ రాజా, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి



పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: కడప కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ బోటని ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ కంట్రోల్ బోర్డ్ అమరావతి సౌజన్యంతో వైల్డ్ లైఫ్–25 కార్యక్రమంతోపాటు బయోడైవర్సిటీ అవగాహన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేమల సలీం బాషా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైవీయూ ప్రొఫెసర్ మధుసూదన రెడ్డి, డిటైర్డ్ డీఎఫ్ఓ ఖాదరవల్లి, కడప జిల్లా బయోడైవర్సిటీ కోఆర్డినేటర్, బోటనీ డిపార్టుమెంట్ హెడ్ డాక్టర్ పి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వైల్డ్ లైఫ్ 25 వారోత్సవాల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరిస్తూ వన్యప్రాణులను ప్రతి ఒక్కరూ సంరక్షించాలన్నారు. వన్యప్రాణులకు, మానవులకు విడదీయలేని సహ సంబంధాలు కలిగి ఉండి పర్యావరణ పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని తెలియజేశారు. ఖాదరవల్లి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీవవైవిధ్య సంరక్షణ కోసం చాలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. అనంతరం పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. జాహ్నవి, స్వీటీ, నాగమణి బహుమతులు అందుకున్నారు.

వైవీయూలో ... ప్రకృతిలో ప్రతి జీవిని రక్షించినపుడు జీవవైవిధ్య లక్ష్యం నెరవేరుతుందని వైవీయూ బొటానికెల్ గార్డెన్ డైరెక్టర్ ఆచార్య ఎ.మధుసూదన రెడ్డి అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ ఆధ్వర్యంలో జీవవైవిధ్యత అవగాహన వారోత్సవాలను ప్రారంభించారు. సైన్స్ బ్లాక్ నుంచి బొటానికెల్ గార్డెన్ వరకు విద్యార్థుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ సమన్వయకర్త డా.ఎన్.వెంకట రామిరెడ్డి , రిటైర్డ్ డీఎఫ్ఓ కడప జిల్లా బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ ఖాదరవల్లి , వైవీయూ ప్రొఫెసర్లు ఆచార్య ఈశ్వర్ రెడ్డి, ఆచార్య ఏ రామచంద్రారెడ్డి, ఎన్ ఎస్ ఎస్ పి ఓ లు డాక్టర్ ఎస్ పి వెంకటరమణ, డాక్టర్ కె లలిత, డాక్టర్ సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్య విలువైనది



ప్రభుత్వ బాలుర గృహంలో పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్

కడప అర్బన్: విద్య విలువైనది, క్రమశిక్షణతో అభ్యసించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ తెలియజేశారు. బుధవారం కడపలోని ప్రభుత్వ బాలుర గృహం, ప్రభుత్వ పరిశీలన గృహంను జడ్జి పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కలిగించారు. ఏవైనా సమస్యలుంటే కడపలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి తీసుకొని రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం, ప్రభుత్వ పరిశీలన గృహం సూపరింటెండెంట్, డిస్టిక్ ప్రొబేషన్ ఆఫీసర్, వైద్యాధికారిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ

కడప అర్బన్: సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ ×పారా లీగల్ వలంటీర్లకు ప్రత్యేక శిక్షణను కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, స్పెషల్ జోనల్ పోలీస్ యూనిట్, సపోర్ట్ పర్సన్ గార్డియన్, వార్డ్ యాక్ట్, బాలల, కౌమార లేబర్ చట్టం 1986, బాలల హక్కుల పరిరక్షణ చట్టం 2005, పిల్లల నిషేధ వివాహ చట్టం 2006, బాల్య న్యాయ చట్టం 2015 ఉచిత, నిర్బంధ విద్య కోసం పిల్లల హక్కు చట్టం 2009, లైంగిక నేరాల నుంచి పిల్లల సంరక్షణ చట్టం 2012, పిల్లల కోసం జాతీయ విధానం 2013, మిషన్ వాత్సల్య పథకం 2022, మోడల్ పోస్టర్ కేర్ మార్గదర్శకాలు 2024 తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

తగ్గిన పన్నులపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా కడప నగరంలోని కళాక్షేత్రంలో ఈనెల 10, 11 తేదీలలో ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయెన్సెస్ ప్రదర్శన, అమ్మకాలను నిర్వహించనున్నట్లు వాణిజ్యపన్నులశాఖ అధికారిణి జి.సుమతి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా వినియోగదారులకు అందుతున్న తగ్గిన పన్నులు, సేవింగ్స్ మరియు ఉత్పత్తులపై లభించే లాభాల గురించి ప్రజలకు వివరించనున్నారు. ఈ సందర్భంగా ప్రజలు నూతన జీఎస్టీ విధానం ద్వారా వస్తువులు, సేవలపై లభించే ఆర్థిక ప్రయోజనాలను తెలుసుకొని, ×సూపర్ సేవింగ్స్ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం

కడప సెవెన్‌రోడ్స్ : రానున్నస్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున అన్నారు. బుధవారం కడప నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బద్వేలు నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ఉపాధ్యక్షులు బాలబత్తిని ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అట్లూరు మండల అధ్యక్షులు మల్లికార్జున, కాశినాయన మండల అధ్యక్షులు బండారు అక్కయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్సు పూర్తి చేసినవారికి సర్టిఫికెట్స్ ఇవ్వాలి



వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయంలో పీజీ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వకుండా యూనివర్సిటీ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు అన్నారు. పీజీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు సకాలంలో ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇచ్చి ఉన్నత చదువులు చదువుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ బుధవారం వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మకు విద్యార్థులతో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

12న గడియారం వేంకట శేషశాస్త్రి విగ్రహావిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని మున్సిపల్ పార్కులో ఈనెల 12న ఉదయం 10 గంటలకు బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ గడియారం వేంకటశేష శాస్త్రి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు శివభారతి విద్యాపీఠం కార్యదర్శి గడియారం వేంకట శేష శర్మ తెలిపారు. గడియారం వేంకట శేష శాస్త్రి రచించిన 'శ్రీ శివభారతం' మహాకావ్యం 1943లో నవీన ఆంధ్ర పంచ కావ్యాలలో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యునిగా రెండు పర్యాయాలు (1959–1968) వరకు సేవలు అందించారని తెలిపారు. 1948లో మద్రాసు ప్రభుత్వం దశాబ్ద కాలపు ఉత్తమ సాహితీ గ్రంథంగా శ్రీ శివభారతాన్ని గుర్తించి ప్రథమ బహుమతి అందించి గడియారం వారిని సత్కరించారన్నారు.